## క్లుప్తంగా

### నిరసన

భామిని: మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. గతంలో ఓట్ ఏజెన్సీ సంస్థ తమను నియమించిందని తెలిపారు. ఆ ఏజెన్సీ గాని ప్రస్తుత ఏజెన్సీ గాని ఎవ్వరూ తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. బకాయిలు చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. నిరసనలో సిర్ల రోజా, తదితరులు పాల్గొన్నారు.

### పక్కాగా పీ 4 సర్వే



గొయిపాకలో పీ4 సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో పీ 4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు సచివాలయం ఉద్యోగులకు సూచించారు. మండలంలోని గొయిపాకలో చేపట్టిన పీ4 సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. అనంతరం కుంతేసు గ్రామాన్ని సందర్శించి, పీఎంఏవై గృహ లబ్ధిదారులతో మాట్లాడారు.

### స్థలం కేటాయించండి



డీఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని దళిత సంఘాల జిల్లా అధ్యక్షుడు బత్తిన మోహనరావు కోరారు. స్థలం కోరుతున్న తమపై కొందరు ఫిర్యాదులు చేయడంపై బుధవారం స్థానిక డీఎస్పీ ఎం. రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మోహనరావు, తదితరులు మాట్లాడుతూ... డివిజన్ కేంద్రంలో తమకు స్థలం కేటాయించడంతో పాటు తమపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గురుబిల్లి రవి కుమార్, ఎమ్మల సతీష్‌కుమార్, రాయి రామకృష్ణ, యామల ఈశ్వరరావు, పి.రమేష్, ఆర్.రవి, రాజాన చంటి, అంపిలి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

### భూ సమస్యలపై అప్రమత్తం



తహసీల్దార్ కామేశ్వరరావును కలిసిన కొత్తగా వచ్చిన విలేజ్ సర్వేయర్లు

వీరఘట్టం: భూ సమస్యలపై విలేజ్ సర్వేయర్లు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు సూచించారు. సీతంపేట మండలం నుంచి వీరఘట్టం మండలానికి బదిలీపై వచ్చిన తొమ్మిది మంది విలేజ్ సర్వేయర్లు బుధవారం స్థానిక తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారికి దిశానిర్దేశం చేశారు.

### ఉత్తమ విద్యార్థులను అందిద్దాం..



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ఉపాధ్యాయ వృత్తి ద్వారా సమాజానికి ఉత్తమ విద్యార్థులను అందిద్దామని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దాసరి నాగభూషణరావు అన్నారు. పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు తంగుడు అనంతరావు, జెన్నీ పార్వతి, కోమలి, సులోచనారాణి, పద్మావతి, ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు, రమేష్ బాబు, నారాయణరావు, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో నాగావళి నదీతీర ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నదీతీర ప్రాంతాల్లో బుధవారం పర్యటించినట్లు చెప్పారు. తోటపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేసి నీరు విడుదల చేస్తున్న క్రమంలో నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. ఆయా ప్రాంతాల వారు నదీ స్నానాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలని వీఆర్వోలకు, కార్యదర్శులను ఇచ్చారు.

# విస్తారంగా వర్షాలు..



గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వకు విస్తారంగా వర్షం కురిసింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు, బాటసారులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఈ వర్షం వరినారుకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు చేసుకోవడానికి కూడా ఈ వర్షం ఉపకరిస్తుందని చెబుతున్నారు.

**ఆశలు రేకెత్తించిన వరుణుడు**

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాత అవస్థలు వర్ణణాతీతంగా మారింది. పాలకొండ మండల పరిధిలో ఈ ఏడాది దాదాపు 18 వేల ఎకరాల్లో వరి సాగుకు సిద్ధమయ్యారు. తోటపల్లి కాలువల ద్వారా సాగు నీరు సకాంలో విడుదల కాకపోవడం.. శివారు గ్రామాలకు నీరు లేక సేద్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే నారుమడులు వేసిన రైతులు నీటి తడులు అందించలేక తలలు పట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పట్టణ, మండల పరిధిలో భారీ వర్షం కురడంతో రైతుల ఆశలు చిగురించాయి. వర్ష ప్రభావంతో నారుమడుల్లో నీరు చేరడం, దమ్ములు చేపట్టడానికి అవకాశం కుదిరింది. మరోవైపు వర్షం కాణంగా ప్రధాన రహదారులు జలమయమయ్యావి. ఆర్టీసీ కాంప్లెక్స్, వీరఘట్టం రహదారితో పాటు కస్పావీధి, కొత్తవీధి, కోమటిపేట, తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది.



పాలకొండ రూరల్: జలమయమైన ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు

## హిందీ కళాశాలల పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి



కేంద్రమంత్రితో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రచార సభ సభ్యులు

పాలకొండ: హిందీ కళాశాలల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని హిందీ ప్రచార సభ ప్రధాన మంత్రి గేల్‌బౌలీ కోరారు. ఈ మేరకు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును బుధవారం కలిసి హిందీ కళాశాలల ఆవశ్యకతను వివరించామన్నారు. మంత్రిని కలిసిన వారిలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ సీఎల్ నాయుడు, చొంగ రమాదేవి, రవి ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది..



రామారావు మాస్టారును సన్మానిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

వీరఘట్టం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎంఈఓ డి.గౌరునాయుడు అన్నారు. మండలంలోని జె.గోపాలపురంలో ఇటీవల బదిలీపై వెళ్లిన బి.రామారావు మాస్టారు బుధవారం సన్మానించారు. సుమారు నాలుగేళ్ల పాటు గ్రామంలో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన మాస్టారు సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సహోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరామర్శ



జరడలో కృష్ణారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పాముల పుష్పశ్రీవాణి, తదితరులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని పలువురిని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి బుధవారం పరామర్శించారు. జి.శివడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజారావు ఇటీవలే మృతి చెందారు. అలాగే జరడ గ్రామ మాజీ సర్పంచ్ ఊయక కృష్ణారావు కూడా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, తదితరులు ఆయా గ్రామాలకు చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సుజాత, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, మాజీ ఎంపీపీ అనిమి ఇందిరాకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు గుడారి విద్యారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మక వెంకటరావు, పార్టీ నాయకుడు ఐ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలకు తప్పని అవస్థలు



గొట్టివలస ఆర్‌ఎస్‌కే వద్ద ఎరువుల కోసం గుమిగూడిన రైతులు

గరుగుబిల్లి: రైతులకు అవసరమైన ఎరువులు అరకొరగా పంపిణీ చేయడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఒక రైతుకు ఒక యూరియా, ఒక డీఏపీ బస్తా మాత్రేమ రైతుసేవా కేంద్రాలలో సరఫరా చేయడంతో మిగిలిన ఎరువులకు ఎక్కడకు వెళ్లాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్‌బీకేల ద్వారా సరిపడా ఎరువులు అందేవి. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. ప్రతిరోజూ ఆర్ఎస్‌లకే రైతులు వందల సంఖ్యలో వస్తున్నారు. ఇదిలా ఉంటే మండలంలోని 13 రైతుసేవా కేంద్రాల ద్వారా 260 మెట్రిక్ టన్నుల యూరియా, 150 మెట్రిక్ టన్నుల డీఏపీ రైతులకు అందించినట్లు ఏఓ జ్యోత్స్న తెలిపారు.

## బత్తిలిలో వైద్య శిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి రవీంద్ర

భామిని: మండలంలోని బత్తిలి రెల్లివీధి డీఎస్ఆర్ కాలనీలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది రోగులను పరీక్షించారు. ఇందులో ముగ్గురు టైఫాయిడ్ జ్వరాలతో.. మరో ఏడుగురు వైరల్‌ఫీవర్స్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

## అక్రమ అరెస్టులు సరికాదు

- వైస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు



మాట్లాడుతున్న వైస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు

కొమరాడ: సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజమండ్రి పేపర్ మిల్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ పోరాటం చేస్తున్న రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.అలాగే లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని కావాలని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక మాఫియా ఉందన్నారు. ప్రజా సమస్యల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు పల్లా అనంతనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### టీకా కార్యక్రమం పరిశీలన

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కొత్త బెలగాం సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కేవీఎస్ పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పీపీ యూనిట్ పరిధిలో గల ఇమ్యునైజేషన్ సెక్షన్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు ఉద్యమానికి స్ఫూర్తి అచ్యుతానందన్

పార్వతీపురం: కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అశోక్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన అచ్యుతానందన్ సంతాప కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల కమ్యూనిస్టు ఉద్యమంలో అచ్యుతానందన్ కేరళ ఉద్యమానికి ఎంతో కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.గంగునాయుడు, జి.వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, ఎం.తిరుపతిరావు, కె.రామస్వామి, బీవీ రమణ, బి.సూరిబాబు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన గ్రామాల్లో ఆరోగ్య తనిఖీలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పరిధిలో గల గిరిజన గ్రామాలు రావికోన, బట్టి వలస, రంగాలగూడ, చందలింగి గ్రామాల్లో వైద్యసిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా ఐదుగురికి జ్వరాలు, ఆరుగురికి చర్మవ్యాధులు, నలుగురికి రక్తహీనతను గుర్తించి ఆయా గ్రామాల్లో వైద్యసేవలు అందించారు. అలాగే ఇతర సాధారణ వ్యాధులకు చికిత్సలు అందించినట్లు సిబ్బంది తెలిపారు. వర్షాకాలంలో జ్వరాలు, వాంతులు, విరోచనాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ టి.వెంకట్ నాయుడు, సూపర్‌వైజరులె జి.శంకరరావు, జయలక్ష్మి, ఎంపీహెచ్‌ఏ కె.రమేష్, హరికృష్ణ, ఏఎన్ఎం వై.ఉష, సీహెచ్‌ఓ బి.ఊర్మిళ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి గురువారం, శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

### ముమ్మరంగా పారిశుధ్య పనులు



బస్టాండ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న అధికారులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈఓపీఆర్‌డీ సీహెచ్ శంకరరావు, వీరఘట్టం ఈఓ బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జేసీబీతో కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి పీహెచ్‌సీ వరకు కాలువలపై వేసిన పలకలను వ్యాపారులు తొలగిస్తే, మురుగు తొలగిస్తామని ఈ సందర్భంగా అధికారులు వ్యాపారులకు సూచించారు.

## ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

- ఏఓ జ్యోత్స్న



వల్లరగుడబలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ టి.జ్యోత్స్న

గరుగుబిల్లి: ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ టి. జ్యోత్స్న సూచించారు. మండలంలోని వల్లరగుడబ, రాయిందొరవలస గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాల యాజమాన్యం, సస్యరక్షణపై వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వరి వెదలు వేసుకున్న పొలల్లో జింక్ లోపం గుర్తిస్తే చిలమిన్ జింక్ రెండు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 260 మెట్రిక్ టన్నుల యూరియా, 150 మెట్రిక్ టన్నుల డీఏపీ.. ప్రైవేట్ షాపులలో 360 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు చెప్పారు. మరో వారం రోజులలో 40 మెట్రిక్ టన్నుల యూరియాను రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి..



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతంపేట: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని ముత్యాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళితే విద్యుత్ మెయిన్ ఆఫ్ చేయాలని తెలిపారు. అనంతరం మంటలు చెలరేగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రావణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నివాళులు..



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక సంఘ నాయకులు

పాలకొండ: కార్మికుల సంక్షేమం కోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మహనీయుడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. సీఐటీయూని ముందుకు నడిపిన వ్యక్తి అచ్యుతానందన్ అని చెప్పారు. 17 ఏళ్ల వయసులోనే కమ్యూనిస్ట్ పార్టీలో చేరి ప్రజల పక్షాన పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాద రాము, బి. అమరవేణి, ఎం. అప్పలస్వామి, ఎస్. ప్రసాద్, బి. పద్మ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడ్ని నియమించరూ..



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు సాంబమూర్తి, రామారావు

కొమరాడ: మండలంలోని పాలెం పంచాయతీ కుస్తూరు పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులుండగా.. ఎనిమిది నెలలుగా ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించడం లేదన్నారున. కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి ఉపాధ్యాయుడ్ని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు రామరావు ఉన్నారు.

## సీతాఫలం విక్రయాలు ప్రారంభం



గుమ్మలక్ష్మీపురంలో సీతాఫలం పండ్లను విక్రయిస్తున్న మహిళలు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో సీతాఫలం విక్రయాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని చాపరాయి జంగిడిభద్ర, అడ్డంగి జంగిడిభద్ర, తోట, గోరటి, కప్పకల్లు, శిఖరపాయి, వాడబాయి, లప్పటి, తదతర గ్రామాలకు చెందిన గిరిజనులు సీతాఫలం పండ్లను సేకరించి గుమ్మలక్ష్మీపురం గ్రామంలో బుధవారం జరిగిన వారపు సంతకు తీసుకొచ్చి విక్రయించారు. వంద పండ్ల బుట్టను రూ.300 నుంచి 400 రూపాయాల వరకు విక్రయించారు.

## నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం రేపు

పాలకొండ: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ రత్నంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ అధ్యక్షురాలు ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. నగర పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, తీర్మానం చేయాల్సి ఉందన్నారు.

## నిరంతర పర్యవేక్షణ అవసరం



తంపటాపల్లిలో పారిశుధ్య పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ విజయరంగారావు

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ప్రజల ఆరోగ్య భద్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఎంపీడీఓ విజయరంగారావు అన్నారు. మండలంలోని తంపటాపల్లిలో పారిశుధ్య పక్షోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెత్తను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో, కాలువల్లో వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామస్వామి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.